# వండర్ ఫుడ్



డా॥ కె.బి.గోపాలం

తిండికోసమై 'హోటల్'కి పోయెను పాపం మనవాడు! అయ్యో...

ఆదివారం, సాయంత్రం.

ఆకలి దంచేస్తోంది. ఇంట్లో ఎవరూ లేరు. మాయావిడ ఛాదస్తం. ఈ కాలంలోకూడా పెళ్ళిళ్ళకు ఓవర్ నైట్ ప్రయాణాలేమిటో! మనకి ఈ విందులూ వినోదాలు జాన్‌తేనై! అవకాశం దొరికితే హాయిగా బయట ఏదైనా హోటల్లో ఝుమ్మని నాన్ వెజ్ లాగించి పారేయాల్సిందే! అవును! అన్నట్లు ఈ రోజుకన్నా ఇందుకు మంచి తరుణం మించిన దొరుకునా! ఛల్ మోహనరంగా!

రేడాన్ లైట్లతో త్రీడైమెన్షన్ హోలో గ్రాం బోర్డు అందంగా ఆహ్వానిస్తోంది. 'సాఫ్ట్‌టెక్' ఆ బొమ్మదగ్గరకు పోతున్నకొద్దీ దూరంగా దగ్గరగా కదులుతున్నట్లుంది. పర్సనల్ కమ్యూటర్ పార్కింగ్ వాడికి అప్పజెప్పి లెవిటేటర్‌లో హోటల్ డాబామీద దిగాను.

''ఇటువేపు జెంటిల్‌మన్! మీ టేబుల్ నంబర్ 3 ఎక్స్' అనౌన్స్ చేసింది రిసెప్షన్‌లోని రోబో. క్రెడిట్ కార్డ్‌ను రోబో చేతికి అందించి, లోపలికి నడిచాను. 3X లో గ్రీన్ లైట్ వెలుగుతోంది. వెళ్ళి కూచున్నాను. వెయిటర్ తొందరగానే వచ్చింది. ఫరవాలేదు! ఇంకా వీళ్ళు మనుషులకు మనుషులచేత తిండి పెట్టిస్తున్నారు!

''ఎస్! జెంటిల్‌మన్! ఏం ఇమ్మంటారు?''

''మెనూ!''

''అదే తింటారా?''

బోడి సెన్సాఫ్ హ్యూమర్! మనసులోనే అనుకున్నాను.

''పీలయితే అభ్యంతరం లేదు!''

''యువర్ విష్! బట్ ట్రై చేయకండి! ఇది ఎడిబుల్ పేపర్ కాదు. తిన్నా అరగదు!'' వంకరగా నవ్వి మెనూ టేబుల్ మీద పెట్టి లోపలికి వెళ్ళింది.

కార్డు చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పాను. అందులో అన్నీ బొమ్మలే. అవన్నీ లేచి టేబుల్ మీదకు దిగుతాయేమోనన్నట్లు కదులుతున్నాయి కూడా. వాటితోబాటు ఏవో నంబర్లు. ఒక పట్టాన అంతు

పట్టలేదు. కొత్త హోటల్‌కు రావడం బుద్ధి తక్కువ అనుకున్నాను. యూజర్ ఫ్రెండ్లీ అనే మాట వీళ్ళకింకా అర్థమయినట్లు లేదు. అనుకుంటుండగానే గాజుకళ్ళు మిలమిలలాడిస్తూ వెయిటరమ్మాయి మళ్ళీ ప్రత్యక్షం!

''యువర్ ఆర్డర్ జెంటిల్‌మన్!''

''జింజర్ చికెన్'' తెలిసిందేదో చెబితే బాధ వదిలిపోతుందన్న భావంతో నెమ్మదిగా అన్నాను.

''ఎన్ని?''

మళ్ళీ అదే సెన్సాఫ్ హ్యూమర్‌గావును! మనసులోనే అనుకున్నాను ''ఎన్నేమిటి ఒకటి!'' ''ఒకటా? ఒకటి... ఒకటి ఎలా జంటిల్‌మన్?'' అమ్మాయి ముఖంలో స్పష్టంగా ప్రశ్న! బకాసురుడా అని తెలుగులో అంటుందిగావును ''పోనీ ముందు ఒక హాఫ్ ఇవ్వండి'' ఈసారి ఆ అమ్మాయి పగలబడి నవ్వినంత పని చేసింది. అంతలోనే తమాయించుకుని ''కనీసం ఒక డజన్ ఆర్డరివ్వండి జెంటిల్‌మన్. తరువాత కావాలంటే మరేదయినా తీసుకుందురుగాని!'' అంది.

నాకు కోపం వచ్చింది. నేనాకలితో ఛస్తుంటే ఈవిడ జోకులు. కానీ తిండికోసం కమ్ప్యూటర్‌ను వాడుకుని పై ఊరికి వచ్చాను ఇక్కడ ఈ అమ్మాయితో కీచులాడే మూడ్ లేదు! ముఖంలో ఏ భావమూ లేకుండా చూశాను. ''సారీ జెంటిల్‌మన్! మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు. నాకు తెలుసు ఇది కొత్తేమీ కాదు. మీరు బహుశః మా దగ్గరికి తొలిసారిగా వచ్చారు. అందునా మెనూలో మొదటి పేజీ మిస్ చేసి ఉంటారు కూడా. మా హోటల్‌ను బయొటిక్ ఫార్మ్స్‌వారు స్పాన్సర్ చేస్తున్నారు. జీవ సాంకేతిక పద్ధతిలో తయారుచేసిన చిన్న చిన్న అంటే మినియేచర్ ఐటమ్స్ మా స్పెషాలిటీ అవి కూడా రెడీ టు ఈట్! మీరేమీ అనుకోకపోతే మీకు నేను సజెస్ట్ చేసిన కోర్స్ తీసుకోండి! యూ విల్ ఎన్జాయ్ ఇట్!'' క్షణంలో మాయమయింది.

అదే స్పీడుతో ట్రాలీతో తిరిగి వచ్చి టేబుల్ సర్దింది. వెండి రంగు కాసరోల్స్ తళతళలాడుతున్నాయి. వాసన గుబాళిస్తున్నది.

మూత తీస్తే ఇంకెంత బాగుంటుందో అనుకుంటూనే, బెరుకుగా, సస్పెన్స్‌గా కాసరోల్ మూత తీసి పక్కన పెట్టాను.

''బాప్‌రే!'' అనుకోకుండా నోట్లోంచి మాటలు బయటకు వచ్చేశాయి. కాసరోల్లో డజను కోడిపిల్లలు ఆలూ బజ్జీలో అరసైజుకు ఉన్నాయి. తలమీద కిరీటం, రంగు రంగుల ఈకలు, మొత్తం శరీరం తోసహా, తిరగడంలేదు! కానీ కదులుతున్నాయి బతికున్నాయేమోనని పిస్తున్నాయి కూడా! నేను చిక్కులో పడ్డాను.

''సారీ జెంటిల్‌మన్! ఒక్క క్షణం పక్క టేబుల్ దగ్గరకు వెళ్ళవలసి వచ్చింది. నాకు తెలుసు మీరు కనుఫ్యూజ్ అవుతారని. అందుకే వచ్చేశాను'' నవ్వింది. ''ఏమిటి? ఇప్పుడు నేను వీటిని వండుకోవాలా?'' ఈసారి నేను జోకాను!

''ఆ కష్టం మీకు అక్కరలేదు. బయోటెక్ వాళ్ళే వండి వార్చి పంపారు వీటిని. మిగతా మూడు కాసరోల్స్‌లో మూడు రకాల సాస్‌లున్నాయి. చేయవలసిందల్లా మీరు ఒక్కొక్క చిక్‌ను తీసి మీ ఇష్టం వచ్చిన సాస్‌లో ముంచి నోట్లో వేసుకోవడమే! మరిచిపోయాను. వాటిని కట్ చేసే ప్రయత్నం మాత్రం చేయకండి! అరిచినా అరుస్తాయి!

''ఇవేమిటి బతికున్నాయా కొంపదీసి?'' అనుమానం ధైర్యంగానే బయటపెట్టాను.

''లేదు! కానీ థ్రిల్ కోసం వాటికి కదలిక, అరుపు ఏర్పాటు చేశాం!''

''అవునా! ఈ ఈకలు గొంతుల్లో ఇరుక్కోవా?'' కాస్త ధైర్యం వచ్చినట్లుంది.

''నెవర్! నిజానికి వాటి రంగు బట్టి సీజనింగ్ గ్రేడ్ గుర్తించవచ్చు! రంగు ఎంత డార్క్‌గా ఉంటే అంత బాగా ఉడికినట్లు లెక్క! ఇక మీరు కానివ్వండి! మళ్ళీ వస్తాను!'' మాయమయింది వెయిటర్ అమ్మాయి.

వీటిని కట్ చేయకూడదు. అందుకే కాబోలు ఫోర్క్, నైఫ్ బదులు అందమయిన టాంగ్స్ ఇచ్చారు. నెమ్మదిగా మొదటి కోడిని పట్టుకుని తెల్లని సాస్‌లో ముంచి నోట్లో వేసుకున్నాను. బ్రహ్మాండం! ఇది బటర్ చికెన్! ఏం రుచి నములుతుంటే ఈకలు ఎముకలు కరకరలాడుతూ భలేగా ఉంది. నెమ్మదిగా జింజర్ చికెన్, టిక్కార్ చికెన్ కూడా ట్రైచేశాను. భలేగా ఉన్నాయి.

''ఇంతకూ వీటినేమంటారు మిస్!'' ఈసారి చాలా సులభంగా అడిగేశాను. ''వాటికో ప్రత్యేకమయిన పేరేమీలేదు! మినీ చిక్ అటే చాలు! త్వరలోనే హైదరాబాద్, విజయవాడల్లోకూడా వీటిని ఇంట్రడ్యూస్ చేస్తారట మా వాళ్ళు మీరు అక్కడే ఎంజాయ్ చెయ్యవచ్చు!'' అంటూ నా క్రెడిట్ కార్డ్ ప్లేట్లో పెట్టి తిరిగి ఇచ్చింది.

సైన్స్ అభివృద్ధి చెందుతోందని తెలుసు. బయో టెక్నాలజీ సాయంతో మందులు, పంటలు వగైరా పెంచుతున్నారని తెలుసు. పశువులను పెంచుతున్నారని కూడా తెలుసు! కానీ ఈ మినీ చిక్ గురించి మాత్రం వినలేదు. హ్యాట్సాఫ్! అందుకే తాతయ్య అంటూ ఉండేవాడు ''తెల్లోడి బిస!''

* * *




రేపు మా అత్తగారు వస్తున్నట్టుత్తరం వచ్చింది..
రేపట్నుంచి పన్లోకి రాకు...

## అపురూప ప్రసూనం

తీరుతీరుల అందాల పుష్పాలు సృష్టిలో చాలా వున్నాయి. అయినా అవేవీ కాదని మరో పువ్వుని సృష్టించి ఇస్తే 20000 డాలర్ల బహుమానం ప్రకటించింది అయోవాలో బర్పీ అనే కంపెనీ. అంతా తెల్లగా ఉండి అపురూపంగాఉండే ఆ పువ్వు పేరు 'మేరిగోల్డ్'.

ఆ పువ్వుని 'ఆలీస్‌వాక్' అనే ఆవిడ ఆ కంపెనీ అడిగిన తీరులో తయారుచేసి ఇచ్చి 1945లో ఆ బహుమతిని గెల్చుకుంది.

—శేషుబాబు




నేను మినీఫుడ్ ఫాన్ అయిపోయాను. అవకాశం చిక్కినప్పుడల్లా ఏదో ఒక టెక్‌ఫుడ్ స్టాల్‌లో దూరి ఏదో ఒకటి తింటూనే ఉన్నాను. బాతులు, మేకలు, కుందేళ్ళు, ఒకటేమిటి రకరకాలు వస్తున్నాయి ఈ మధ్యన. మొన్న అబిడ్స్‌లో అదేదో స్టాల్‌లో మినీ టార్టాయిస్ తిన్నాను. వింతగా ఉంది. బయోటెక్ విచిత్రంగానే ఉంది. గొర్రె ఉన్ని తిన్నా, తాబేలు బొచ్చెతిన్నా రుచిగానే ఉన్నాయి. అంతకంటే ఆశ్చర్యం మినీ ఫ్రూట్ సలాడ్! బేల్ నిండా ఫెర్రీస్ సైజ్‌లో పుచ్చపళ్ళు, మామిడి పళ్ళు, కర్బూజాలు, ఒక్కొక్కటే తీసి నోట్లో వేసుకుంటే, కరిగిపోతున్నాయి. రుచి ఫెంటాస్టిక్, మామిడి కాయలో టెంక కూడా ఉంది. నమిలితే అచ్చు కాజా రుచిలో ఉంది. తొక్కలు ఘుమఘుమ లాడుతున్నాయి. వీటన్నింటిలోకి బత్తాయిలు చాలా బాగున్నాయి. తొక్క లోపలనుంచి తొనలు కనబడుతున్నాయి కూడా!

పేపర్‌లో కనబడ్డ ప్రతి అడ్వర్టయిజ్‌మెంట్‌నూ ఫాలో చేస్తూ ఊర్లో ఉన్న మినీ ఫుడ్ స్టాల్స్ అన్నీ పావనం చేశాను. ఈ మధ్యనే సికింద్రాబాద్‌లో ఒకచోట మినీ ఫిష్ ప్రారంభించారు. వాళ్ళ స్పెషాలిటీ డిష్ ఏమిటో తెలుసా? మినీ తిమింగలం! అయితే ఒక్కడినీ తినడం కుదరదన్నాడు. కనీసం నలుగురయినా కలిసి వస్తే సర్వ్ చేస్తానన్నాడు. తిమింగలాలు తరిగిపోకుండా కాపాడారని పేపర్లో చదివాను. కానీ అవి సంఖ్యలో పెరిగి సైజులో తరిగి డైనింగ్ టేబుల్ మీదకు వస్తాయనిమాత్రం అనుకోలేదు. దీన్నెలాగయినా టేస్ట్ చేయాలి! కంపెనీకోసం వెదకాలి!

* * *

కాన్ఫరెన్స్ అయిపోయింది. సాయంత్రం బజారులో పరధ్యానంగా నడుస్తున్నాను. కాస్తేదయినా తింటే వెళ్ళి నడుం వాల్చవచ్చు. నిజానికి ఆకలిగా లేదు. మధ్యాహ్నం చాలా పద్ధతిగా భోజనం ఏర్పాటు చేశారు. ట్రెడిషనల్ భోజనాలు అలవాటు లేకుండా ఉంది. అయినా బాగానే తిన్నాను. కాబట్టి కొంచెం ఏదయినా తింటే చాలు. తళుక్కున 'సాఫ్ట్‌టెక్' గుర్తొచ్చింది. నా మినీ ఫుడ్ తొలి అనుభవం ఈ ప్రాంతంలోనే అనేమాట కూడా గుర్తొచ్చింది. వీధి చివర 'ఇన్‌ఫర్‌మేషన్ కౌంటర్'లోకి వెళ్ళాను.

'ఇక్కడినుంచి సాఫ్ట్‌టెక్ చాలా దగరే అనుకుంటాను. ఎలా వెళ్ళాలో చెప్పగలరా?''

''వెల్‌కం! జెంటిల్‌మన్! అంతకన్నా మంచి ఫుడ్‌స్టాల్ పక్కనే ఉంది.

''బిగ్‌టెక్'' ట్రై చేయకూడదూ? ఇదుగో ఈ పక్క బిల్డింగులోనే! రండి చూపిస్తాను'' అంటూ అతను లేచి దారితీశాడు.

అప్రయత్నంగా అతని వెనకాల నడిచాను.

ఎల్‌సిడి డిస్‌ప్లే బోర్డులో 'బిగ్ టెక్' అన్న చిన్న చిన్న అక్షరాలు రకరకాల రంగుల్లో మెరిసి మాయమవుతున్న ఒక స్టాల్‌లోకి చేరుకున్నాం. ''వెల్‌కం ఫ్రెండ్స్! మీ టేబుల్ నంబర్ 'జి డబుల్ ఎక్స్' అన్నాడు కౌంటర్లో అబ్బాయి.

''థాంక్యూ! నేను భోజనానికి రాలేదు. ఒక కొత్త నేస్తాన్ని తీసుకు వచ్చాను. హెల్ప్ హిమ్! అని నాతోబాటు వచ్చినతను సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు 'రండి ఫ్రెండ్! మీకు 'డి.ఎక్స్' అలాట్ చేస్తాను! యువర్ కార్డ్ ప్లీజ్! అంటూ అబ్బాయి కంప్యూటర్‌లో ఏవో కమాండ్స్ పంచ్ చేశాడు. హాల్లో డి—ఎక్స్ సులభంగానే దొరికింది. టేబుల్ మీద మెనూ కార్డు రెడీగా ఉంది. అదొక ఎలక్ట్రానిక్ మానిటర్ లాంటిది. కీస్ నొక్కుతూ లైట్ అయిటమ్స్‌కోసం వెదికాను. ఒక పేజ్‌లో ఎగ్స్, మరొక పేజ్‌లో పళ్ళు కనబడ్డాయి. ఒక ఎగ్, కాసిని గ్రేప్స్ ఆర్డర్ పంచ్ చేశాను. ''వీటిని ఎక్కడ డెలివర్ చేయమంటారు?'' అనే ప్రశ్న మానిటర్ తెరమీద వచ్చింది.

''ఇక్కడే తింటాను'' అని జవాబు ఎంటర్ చేశాను.

''ఇంపాజిబుల్! మీరు ఒక్కరే ఉన్నారు!'' జవాబు.

నేను మళ్ళీ చిక్కుల్లో పడ్డాను.


''ఒకసారి ఇలా వస్తారా?'' కౌంటర్‌లో అబ్బాయిని పిలిచాను.

''నాకు తెలుసు! మీరిలా పిలుస్తారని. మీ కమాండ్స్ నేను చూస్తూనే ఉన్నాను. ఒక ఎగ్, కొన్ని ద్రాక్షపళ్ళు తినాలంటే మీరు పురాణకాలంనాటి హీరో అయి ఉండాలి.

ఇన్‌ఫర్‌మేషన్ అతను మీకు మా స్టాల్ గురించి చెప్పలేదనుకుంటాను. అతను సరదాకోసం అలా చేసి ఉంటాడు. మా స్పెషాలిటీ బిగ్‌ఫుడ్ బయోఫుడ్ ఫార్మ్స్ వాళ్ళ కొత్త టెక్నాలజీ ఇంట్రడ్యూస్ చేశారు. వాళ్ళు సప్లై చేసే ఒక బాయిల్డ్ ఎగ్ మీ కుటుంబానికంతా సరిపోతుంది. మీరు మహా అయితే ఒక ద్రాక్షపండు తినగలరు. రొయ్యలు, మష్రూమ్స్, రకరకాలు సూపర్ సైజుల్లో మా దగ్గర దొరుకుతాయి. ఎక్స్ టేబుల్లో మామూలు ఆర్డరు స్మాల్ సైజ్ సైజ్‌కన్నా ఎక్కువ ఉంటే మా కంప్యూటర్ హోమ్ డెలివరీ కింద లెక్కపెడుతుంది. మీరు ఒక ముక్క ఎగ్, ఒక ముక్క గ్రేప్ ఆర్డర్ చేయండి. రోబో తెచ్చి పెడుతుంది!'' అన్నాడు ఆ అబ్బాయి.

ఈసారి నాకు కోపం రాలేదు. ఆశ్చర్యం అంతకన్నా లేదు!

''వండర్ ఫుల్ బయోటెక్నాలజీ!'' అనుకున్నానంతే!




## మందు

''మీరిచ్చిన ఈ మందు నిజంగా నా వ్యాధిని నయం చేస్తుందాండీ?'' — డాక్టర్‌నడిగాడు సోములు.

''తప్పకుండా! ఎందుకంటే ఈ మందు తీసుకున్న వాళ్ళెవ్వరూ తిరిగి నా దగ్గరకు రాలేదు'' గర్వంగా చెప్పాడు డాక్టర్.

జి.శ్రీనివాస్
హైదరాబాద్